ఎస్జీటీలకు పదోన్నతులు కల్పించండి: జాక్టో

హైదరాబాద్, జూన్ 20 (నమస్తే తెలంగాణ): విద్యాశాఖలో 900కి పైగా ఖాళీగా ఉన్న పోస్టుల్లో అర్హతలు ఉన్న ఎస్జీటీలకు పదోన్నతులు కల్పించాలని ఉపాధ్యాయ సంఘాల జాక్టో విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి బుర్రా వెంకటేశంను కోరారు. ఆ తర్వాతే పండిట్లు, పీఈటీలకు అవకాశం కల్పించాలని విన్నవించారు. గురువారం సచివాలయంలో ఆయనను కలిసి వినతిపత్రం అందజేశారు. ఆయన సానుకూలంగా స్పందించినట్టు జాక్టో నాయకులు సదానందం గౌడ్, కృష్ణుడు, రాధాకృష్ణ తెలిపారు.

పెండింగ్ డీఏలను విడుదల చేయాలి: టీఎన్జీవోస్

హైదరాబాద్, జూన్ 20 (నమస్తే తెలంగాణ): పెండింగ్ డీఏలను విడుదల చేయాలని మంత్రి పొన్నం ప్రభాకర్, కోదండరాంను టీఎన్జీవోస్ కోరారు. నేడు జరిగే మంత్రివర్గ సమావేశంలో ఉద్యోగ, ఉపాధ్యాయ పెన్షనర్లకు డీఏ బకాయిలు చెల్లించే నిర్ణయం తీసుకోవాలని టీఎన్జీవో ప్రతినిధులు వారిని కలిసి తీర్మాన ప్రతిని వారికి అందజేశారు. తమ విజ్ఞప్తిపై మంత్రి సానుకూలంగా స్పందించారని టీఎన్జీవో రాష్ట్ర అధ్యక్షుడు మారం జగదీశ్వర్, ప్రధాన కార్యదర్శి ఎస్ఎం హుస్సేని (ముజీబ్) పేర్కొన్నారు.

'జీతాలు వెనక్కి తీసుకునే కాలేజీలపై చర్యలు తీసుకోవాలి'

హైదరాబాద్, జూన్ 20 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలోని సాంకేతిక కళాశాలల్లో, ఇంజినీరింగ్, ఫార్మసీ, ఎంబీఏ, ఎంసీఏ కళాశాలల్లో వేతనాలు వేసి తిరిగి తీసుకుంటున్నారని, అలాంటి వాటిపై చర్యలు తీసుకోవాలని టీఎస్‌టీసీఈఏ అధ్యక్షుడు అయినేని సంతోష్‌కుమార్ ఉన్నత విద్యాశాఖకు విజ్ఞప్తి చేశారు. కొన్ని ప్రైవేట్ కాలేజీల్లో లక్షల కొద్ది రూపాయలు ఖాతాలో జమ చేసి తిరిగి తీసుకుంటున్నారని, కొన్ని అసలు జీతాలే సక్రమంగా ఇవ్వటం లేదని వాపోయారు. ఆ కాలేజీలకు జేఎన్టీయూహెచ్ఏ అఫిలియేషన్ ఎలా ఇస్తుందని ప్రశ్నించారు. వీటిపై చర్యలు తీసుకోవాలని ఉన్నత విద్యాశాఖను కోరారు.

త్వరలో రామగుండం 'బీ థర్మల్' మూసివేత

రూ.14.8 కోట్లతో నిర్మాణం.. 1965లో తొలివెలుగులు

తొమ్మిదేండ్ల కిందటే ముగిసిన ప్లాంటు జీవిత కాలం
విద్యుత్తు కేంద్రం బాయిలర్లలో తరచూ సమస్యలు
ప్లాంటులో 15 రోజులుగా నిలిచిన విద్యుత్తు ఉత్పత్తి

పెద్దపల్లి జిల్లాలోని రామగుండం బీ థర్మల్ విద్యుత్ కేంద్రం

పెద్దపల్లి, జూన్ 20 (నమస్తే తెలంగాణ): దశాబ్దాల చరిత్ర కలిగి ఉమ్మడి రాష్ట్రంలోనే తొలి వెలుగులు పంచిన 62.5 మెగావాట్ల పెద్దపల్లి జిల్లా రామగుండం బీ థర్మల్ విద్యుత్తు కేంద్రం నేడో రేపో మూతపడనున్నది. 1965లో రూ.14.8 కోట్ల వ్యయంతో అంతర్జాతీయ అభివృద్ధి యునైటెడ్ స్టేట్స్ ఏజెన్సీ ఆర్థిక సాయంతో 62.5 మెగావాట్ల విద్యుత్తు సామర్థ్యంతో ఈ ప్రాజెక్టును చేపట్టారు. బీ-థర్మల్ ప్లాంట్‌ను నెలకొల్పిన 13 ఏండ్ల తర్వాత దీని సరిహద్దును ఆనుకొనే 1978లో కేంద్ర ప్రభుత్వం ఎన్టీపీసీ(నేషనల్ థర్మల్ పవర్ కార్పొరేషన్)కి పునాది రాయి వేసింది. 1983లో కేవలం 200 మెగావాట్ల సామర్థ్యంతో ఉత్పత్తి ప్రారంభించిన కార్పొరేషన్.. దశలవారీ విస్తరణతో ప్రస్తుతం 2600 మెగావాట్ల ఉత్పత్తి సామర్థ్యానికి చేరుకుని దక్షిణ భారత దేశం మొత్తానికి వెలుగులు పంచుతున్నది. అయితే.. బీ థర్మల్ ప్రాజెక్టు జీవితకాలం 50 ఏండ్లు. కానీ ప్లాంట్ ఏర్పాటు చేసి 59 ఏండ్లు కావడంతో తరచూ సమస్యలు వస్తున్నాయి. ప్లాంటు నిర్వహణ భారంగా మారింది. బాయిలర్, టర్బయిన్, మిల్స్, ట్రాన్స్‌ఫార్మర్ తదితర విభాగాల్లో ఏడాదిగా క్రమం తప్పకుండా సాంకేతిక సమస్యలు తలెత్తుతున్నాయి. బాయిలర్లలో ఈ నెల 5న సాంకేతిక సమస్యలు తలెత్తాయి. తాజాగా యూనిట్ ట్రిప్ అయ్యి విద్యుత్తు ఉత్పత్తి నిలిచిపోయింది. మరమ్మతులకు, రిపేర్లకు విద్యుత్తు సౌధ నుంచి అనుమతులు రాకపోవడంతో పునరుద్ధరణ చేపట్టలేదు. దీంతో విద్యుత్తు ఉత్పత్తి పునరుద్ధరణకు రూ.25 లక్షలకుపైగా వ్యయం అవుతుండగా.. ఉత్పత్తి ద్వారా వచ్చే ఆదాయం కన్నా వ్యయమే అధికంగా ఉండటంతో మూసివేయాలనే నిర్ణయానికి వచ్చినట్టు తెలుస్తున్నది. ఈ ప్రాజెక్టులో మొత్తంగా 803 మంది అధికారులు, సిబ్బంది పనిచేస్తున్నారు. ప్లాంట్ మూతపడనున్న నేపథ్యంలో జెన్‌కో సీఎండీ రిజ్వి ఈ నెల 13న 38 మంది ఇంజినీర్లు, ఐదుగురు సబ్ ఇంజినీర్లు, సీనియర్ కెమిస్ట్, నలుగురు కెమిస్ట్‌లను యాదాద్రి థర్మల్ పవర్ స్టేషన్‌కు డిప్యుటేషన్‌పై బదిలీ చేశారు. ప్రభుత్వంపై వ్యతిరేకత రావడంతో డిప్యూటేషన్ ఉత్తర్వులను రద్దు చేశారు. రాష్ట్రంలోని వివిధ పవర్ ప్లాంట్లలో పనిచేసేందుకు వారి ఇష్టం మేరకు వెళ్లాలనుకునే ఉద్యోగులకు మాత్రం అవకాశం ఇస్తూ మరో ఉత్తర్వును జారీ చేశారు. రామగుండం బీ థర్మల్ విద్యుత్తు కేంద్రానికి కాలం చెల్లడంతో అదే స్థానంలో 800 మెగావాట్ల విద్యుత్తు సామర్థ్యం ఉన్న కొత్త ప్లాంటును ఏర్పాటు చేయాలనే డిమాండ్ స్థానికంగా వినిపిస్తున్నది. అప్పటి వరకూ పాత విద్యుత్తు ప్లాంటును కొనసాగించాలని ప్రజలు కోరుతున్నారు.

రామాయణం అపహాస్యం చేస్తూ నాటకం...
విద్యార్థులకు జరిమానా

ముంబై, జూన్ 20: రామాయణ ఇతిహాసాన్ని కించపరిచేలా నాటకాన్ని ప్రదర్శించిన 8 మంది ఐఐటీ బాంబే విద్యార్థులు ఒక్కొక్కరికీ గరిష్ఠంగా 1.2 లక్షల జరిమానా విధించారు. విద్యా సంస్థలో జరిగిన పెర్‌ఫార్మింగ్ ఆర్ట్స్ ఫెస్టివల్‌లో భాగంగా 'రాహోవన్' పేరుతో రామాయణాన్ని ఎగతాళి చేసేలా మార్చి 1న కొందరు విద్యార్థులు ఒక నాటకాన్ని ప్రదర్శించారు. ప్రధాన పాత్రధారి రాముడిని అవమానపరిచే దృశ్యాలు, డైలాగులు ఉండటమే కాక, మొత్తం రామాయణాన్నే కించపరిచేలా నాటకం ఉందంటూ కొందరు విద్యార్థులు యాజమాన్యానికి ఫిర్యాదు చేశారు. దీంతో విచారణ జరిపి అది వాస్తవమేని నిర్ధారణ కావడంతో ఒక్కో విద్యార్థికి 40 వేల నుంచి 1.20 లక్షల రూపాయల వరకు జరిమానా విధించారు. జూలై 30లోగా ఈ మొత్తాన్ని చెల్లించాలని ఆదేశించారు.

ఎంఎస్పీకి చట్టబద్ధత కల్పించాలి

రైతు నేత జగ్జిత్ సింగ్ దల్లేవాల్ డిమాండ్

చండీగఢ్, జూన్ 20: దేశంలోని పలు పంటలకు అతి స్వల్పంగా కనీస మద్దతు ధర పెంచి, కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అన్నదాతలను మరోసారి మోసగించిందని రైతు నేత జగ్జిత్ సింగ్ దల్లేవాల్ గురువారం ఆరోపించారు. కనీస మద్దతు ధరకు చట్టబద్ధత కల్పించాలని డిమాండ్ చేస్తున్నామని, అది ఇస్తే తమకు ఎంఎస్పీ దక్కుతుందని ఆయన అన్నారు. ఎరువులు, విత్తనాలు, డీజిల్ వంటి వాటికి తాము పెడుతున్న ఖర్చుతో పోలిస్తే పెంచిన కనీస మద్దతు ధర అతి స్వల్పమని ఆయన అన్నారు. ఇది దేశంలోని రైతులను మోసగించడమేనని, ఈ పెంచిన మొత్తం రైతులకు ఏ విధంగానూ ప్రయోజనం చేకూరదని ఆయన అన్నారు. గతంలో క్వింటాల్ పత్తి కనీస మద్దతు ధర 6,500 ఉండగా, రైతులు 4,000-4,500కు అమ్ముకున్న విషయాన్ని ఆయన గుర్తు చేస్తూ, అలాంటప్పుడు ఎంఎస్పీతో ఉపయోగం ఏమిటని ప్రశ్నించారు.

అమరావతిలో సీఎం చంద్రబాబు పర్యటన

హైదరాబాద్, జూన్ 20 (నమస్తే తెలంగాణ): ఆంధ్రప్రదేశ్ రాజధానికి నిర్ధారించిన అమరావతి ప్రాంతాన్ని గురువారం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సందర్శించారు. రాజధాని నిర్మాణం కోసం ప్రధాని మోదీ గతంలో శంకుస్థాపన చేసిన ప్రాంతాన్ని సందర్శించి పూజలు నిర్వహించారు. మంత్రులు, అఖిల భారత సర్వీసు అధికారులు, న్యాయమూర్తుల గృహ సముదాయాలను పరిశీలించి విలేకరులతో మాట్లాడారు. ఏపీ అంటే అమరావతి, పోలవరం అని పేర్కొన్నారు. పోలవరం పూర్తయితే రాయలసీమ సతనాల సీమగా మారుతుందని స్పష్టం చేశారు.

నీట్ పరీక్షలను వెంటనే రద్దు చేయాలి

- బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు శ్రీనివాస్‌గౌడ్

హైదరాబాద్, జూన్20 (నమస్తే తెలంగాణ): దేశవ్యాప్తంగా నిర్వహించిన నీట్ పరీక్షల్లో జరిగిన అవకతవకలను దృష్టిలో పెట్టుకొని తక్షణమే నీట్ అర్హత పరీక్షను రద్దుచేసి, ఈ వ్యవహారంపై సుప్రీంకోర్టు న్యాయమూర్తితో విచారణ జరిపించాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ డిమాండ్ చేశారు. గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. లక్షలాది మంది విద్యార్థుల జీవితాల భవిష్యత్‌కు సంబంధించిన విషయంలో చాలా కఠినంగా వ్యవహరించాల్సిన ప్రభుత్వం, అందుకు భిన్నంగా ఉదాసీన వైఖరి అవలంభిస్తున్నదని మండిపడ్డారు.

అకౌంట్ ఆఫీసర్ల ఎంపిక జాబితా విడుదల

హైదరాబాద్, జూన్20 (నమస్తే తెలంగాణ): పరిపాలన, పట్టణాభివృద్ధి శాఖలో అకౌంట్ ఆఫీసర్లుగా ఎంపికైన అభ్యర్థుల తుది జాబితాను టీజీపీఎస్సీ విడుదల చేసింది. టీజీపీఎస్సీ సెక్రటరీ నవీన్ నికోలస్ గురువారం ప్రకటన విడుదల చేశారు. పరిపాలన, పట్టణాభివృద్ధి శాఖలో జూనియర్ అకౌంట్స్ ఆఫీసర్, సీనియర్ అకౌంటెంట్ పోస్టుల కోసం 2022లో నోటిఫికేషన్ జారీ కాగా, 26,548మంది దరఖాస్తు చేసుకోగా, ఆగస్టులో రాత పరీక్ష రాశారు. మెరిట్ ఆధారంగా సర్టిఫికెట్ వెరిఫికేషన్ నిర్వహించి 76మంది అభ్యర్థులను ఆయా పోస్టులకు ఎంపిక చేశారు. తుది జాబితాను వెబ్‌సైట్‌లో (https://www.tspsc.gov.in) పొందుపరిచారు.

మలేషియా విమానంలో మంటలు

- శంషాబాద్‌లో టేకాఫ్ అయిన 15 నిమిషాలకే ఘటన
- అత్యవసర ల్యాండింగ్, ఊపిరిపీల్చుకున్న ప్రయాణికులు

శంషాబాద్ రూరల్, జూన్ 20: మలేషియా ఎయిర్‌లైన్స్ విమానానికి ముప్పు తప్పింది. శంషాబాద్ ఎయిర్‌పోర్టు నుంచి బుధవారం రాత్రి 12.15 నిమిషాలకు 130 మంది ప్రయాణికులతో టేకాఫ్ అయిన 15 నిమిషాలకు విమానం కుడివైపున ఇంజిన్‌లో మంటలు చెలరేగాయి. గుర్తించిన పైలట్ గాలిలోనే చక్కర్లు కొడుతూ కిందకు దించేందుకు ఏటీసీ అధికారులను అనుమతి కోరారు. దీంతో అత్యవసర ల్యాండింగ్‌కు అనుమతివగా, శంషాబాద్ ఎయిర్‌పోర్టులో ల్యాండింగ్ చేశారు. మంటలను సిబ్బంది వెంటనే ఆర్పివేశారు. ప్రమాదం తప్పడంతో అధికారులు, ప్రయాణికులు ఊపిరిపీల్చుకున్నారు. సమస్యను పూర్తిగా పరిష్కరించిన అనంతరం విమానం కౌలాలంపూర్ బయలుదేరినట్టు ఎయిర్‌పోర్టు ప్రతినిధులు తెలిపారు.

ఫోన్ ట్యాపింగ్ నిందితులకు బెయిల్ తిరస్కరణ

నాంపల్లి కోర్టులు, జూన్ 20 (నమస్తే తెలంగాణ): ఫోన్ ట్యాపింగ్ కేసులో ఎస్ఐబీ మాజీ డీఎస్పీ ప్రణీత్‌కుమార్, అదనపు డీఎస్పీలు భుజంగరావు, తిరుపతన్నల తరపున దాఖలు చేసిన మాండేటరీ (తప్పనిసరి) బెయిల్ పిటిషన్లను కోర్టు గురువారం తిరస్కరించింది. నిందితుల రిమాండ్ 90 రోజులు పూర్తికావడంతో బెయిల్ పిటిషన్లు దాఖలు చేసి, కోర్టుకు తమ వాదనలు వినిపించారు. ఇటీవల పంజాగుట్ట పోలీసులు చార్జిషీట్‌ను దాఖలు చేసినప్పటికీ తప్పులు దొర్లినందున కోర్టు వెనక్కి పంపించిందని గుర్తుచేశారు. అందువల్ల చార్జిషీట్ దాఖలు చేసినట్టుగా పరిగణించరాదన్నారు. రిమాండ్ ఖైదీలుగా 90రోజులు పూర్తయినందున బెయిల్ మంజూరు చేయాలని కోరారు. ఇందుకు ప్రత్యేక పీపీ సాంబశివారెడ్డి అభ్యంతరం తెలిపారు. పోలీసులు 90 రోజుల్లోపే చార్జిషీట్‌ను దాఖలు చేశారని, 167(2) సీఆర్పీసీ ప్రకారం తప్పనిసరి బెయిల్ మంజూరు చేయాలన్న నింబంధన వర్తించదని చెప్పారు. విచారణ కీలక దశలో ఉన్నదని పీపీ వాదనతో కోర్టు ఏకీభవించి బెయిల్ పిటిషన్లను డిస్మిస్ చేసింది.

2029లో వైసీపీదే అధికారం

- ఏపీ మాజీ సీఎం జగన్

హైదరాబాద్, జూన్ 20(నమస్తే తెలంగాణ): 2029 నాటికి చంద్రబాబు మోసాలు, ప్రలోభాలు గుర్తించి ప్రజలు రెట్టించిన ఉత్సాహంతో మళ్లీ వైసీపీని అధికారంలోకి తెచ్చుకుంటారని మాజీ సీఎం జగన్ తెలిపారు. గురువారం కీలక నేతల సమావేశం నిర్వహించి దిశానిర్దేశం చేశారు. నిత్యం ప్రజల్లో ఉండాలని నేతలకు సూచించారు. వైసీపీ అధికారంలో ఉన్నప్పుడు గడపగడపకూ సంక్షేమ పథకాలు అందించామని గుర్తు చేశారు. 2029లో వైసీపీనే అధికారంలోకి వస్తుందని స్పష్టం చేశారు.

పద్మనాభం.. ఇక పద్మనాభరెడ్డి

హైదరాబాద్, జూన్ 20(నమస్తే తెలంగాణ): వైసీపీ నాయకుడు ముద్రగడ పద్మనాభం పేరును ముద్రగడ పద్మనాభరెడ్డిగా మార్చుతూ గురువారం ఏపీ ప్రభుత్వం గెజిట్ నోటిఫికేషన్ జారీ చేసింది. పిఠాపురం నియోజకవర్గం నుంచి జనసేన నాయకుడు పవన్‌కల్యాణ్‌ను ఓడించకపోతే తన పేరు మార్చుకుంటానని ఎన్నికల సమయంలో ముద్రగడ సవాల్ చేశారు. పవన్ ఎన్నికల్లో గెలవడంతో తన సవాల్‌కు కట్టుబడుతూ పేరు మార్పునకు దరఖాస్తు చేసుకున్నారు. ఈ మేరకు ఆయన పేరును మార్చుతూ గెజిట్ నోటిఫికేషన్ జారీచేశారు.

జగన్ అక్రమ ఆస్తుల కేసు విచారణ

హైదరాబాద్, జూన్20 (నమస్తే తెలంగాణ): సీబీఐ కోర్టులో జగన్ అక్రమాస్తుల కేసుల విచారణ కొనసాగుతున్నది. ఈడీ కేసుల్లో జగన్ సహా దాదాపు 130 పిటిషన్లపై పదేండ్లుగా విచారణ కొనసాగుతున్న విషయం తెలిసిందే. అయితే తాజాగా శుక్రవారం నుంచి చార్జీషీట్ల వారీగా డిశ్చార్జి పిటిషన్లపై విచారణ చేపట్టాలని న్యాయస్థానం నిర్ణయించింది.

వాణిజ్య

ఇనోబ్యాట్‌లో పెరిగిన అమర రాజా వాటా

హైదరాబాద్, జూన్ 20: నార్వేకు చెందిన ఇనోబ్యాట్ ఏఎస్‌లో వాటాను మరింత పెంచుకున్నది అమర రాజా ఎనర్జీ అండ్ మొబిలిటీ సంస్థ. కొత్తగా 4.5 శాతం వాటాను కొనుగోలు చేయడానికి 20 మిలియన్ల యూరోల (రూ.180 కోట్లకు పైమాటే) పెట్టుబడి పెట్టింది. దీంతో సంస్థలో అమర రాజా వాటా 9.32 శాతానికి చేరుకున్నది. గతంలో 10 మిలియన్ యూరోల పెట్టుబడి పెట్టిన విషయం తెలిసిందే.

డాలర్ ముందు రూపీ వెలవెల

ఒకానొక దశలో ఆల్‌టైమ్ లో.. 27 పైసలు క్షీణత
17 పైసలు పడిపోయి 83.61 వద్దకు • 2 నెలలకుపైగా కనిష్ఠానికి పతనం



ముంబై, జూన్ 20: డాలర్‌తో పోల్చితే రూపాయి మారకం విలువ 2 నెలలకుపైగా కనిష్ఠ స్థాయిని తాకింది. గురువారం ఫారెక్స్ మార్కెట్‌లో ఉదయం ఆరంభం నుంచే దేశీయ కరెన్సీ.. అమెరికా డాలర్ ముందు చతికిలపడుతూ వచ్చింది. ఈ క్రమంలోనే ఒకానొక దశలో ఆల్‌టైమ్ కనిష్ఠ స్థాయికీ పడిపోయింది. ఏకంగా 27 పైసలు దిగజారి మునుపెన్నడూ లేనివిధంగా 83.68 స్థాయికి వెళ్లింది. అయితే మళ్లీ కోలుకోవడంతో 10 పైసలు బలపడింది. చివరకు బుధవారం ముగింపుతో చూస్తే 17 పైసలు క్షీణించి 83.61 వద్ద స్థిరపడింది. ఈ ఏడాది ఏప్రిల్ 16న కూడా ఇదే స్థాయి వద్ద నిలిచిన విషయం తెలిసిందే.

క్రూడ్ సెగ

అంతర్జాతీయ మార్కెట్‌లో ముడి చమురు ధరలు పెరగడం.. రుపీని ప్రభావితం చేసింది. మిడిల్ ఈస్ట్ దేశాల్లో రాజకీయ, భౌగోళిక ఉద్రిక్తతలు.. క్రూడ్ రేట్లను ఎగదోశాయి. ఈ క్రమంలోనే దేశీయ స్టాక్ మార్కెట్లు పెరిగినా ఆ జోష్‌ను రుపీ అందుకోలేకపోయింది. విదేశీ పెట్టుబడులు ఈక్విటీల్లోకి వచ్చినా రుపీపై ఒత్తిడి తగ్గలేదని ఫారెక్స్ ట్రేడర్లు సైతం విశ్లేషిస్తున్నారు. నిజానికి ఉదయం ఆరంభంలో 83.43 వద్ద మొదలైన రుపీ.. ఒకానొక దశలో 83.42కు బలపడింది. బుధవారం 83.44 వద్ద ముగిసిన సంగతి విదితమే.

ఇది కొనసాగితే..

రుపీ నష్టాలు ఇదే స్థాయిలో కొనసాగితే దేశీయ దిగుమతులపై ఆ ప్రభావం పెద్ద ఎత్తున ఉంటుంది. ద్రవ్యోల్బణాన్ని ఎగదోసి.. దేశ ఆర్థిక వ్యవస్థనే చిక్కుల్లో పడేయగలదు. వాస్తవానికి ఆర్బీఐ.. రుపీ ట్రేడింగ్‌లో జోక్యం చేసుకుంటూనే ఉంటుంది. అయినప్పటికీ దేశ, విదేశీ పరిణామాలు షేక్ చేస్తూనే ఉన్నాయి. అయితే దేశంలో పెరుగుతున్న ఫారెక్స్ రిజర్వులు కొంతలో కొంత ఊరటగా చెప్పుకోవచ్చని మెజారిటీ నిపుణులు మాట.

తెలుగు రాష్ర్టాల్లో జియో దూకుడు

హైదరాబాద్, జూన్ 20: టెలికం దిగ్గజం రిలయన్స్ జియో దూసుకుపోతున్నది. ఈ ఏడాది ఏప్రిల్ నెలలో తెలుగు రాష్ర్టాల్లో కంపెనీ నెట్‌వర్క్‌లోకి కొత్తగా 1.56 లక్షల మంది చేరారు. టెలికం నియంత్రణ మండలి ట్రాయ్ విడుదల చేసిన నివేదిక ప్రకారం తెలంగాణతోపాటు ఆంధ్రప్రదేశ్‌లో కొత్తగా 1,56,296 మంది నూతన సబ్‌స్క్రైబర్లు చేరడంతో మొత్తం సంఖ్య 3.29 కోట్లకు చేరుకున్నారు.

ఓలా ఐపీవోకి గ్రీన్‌సిగ్నల్

న్యూఢిల్లీ, జూన్ 20: ఎలక్ట్రిక్ ద్వి-చక్ర వాహన సంస్థ ఓలా ఎలక్ట్రిక్..ఐపీవోకి స్టాక్ మార్కెట్ నియంత్రణ మండలి సెబీ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. బహిరంగ మార్కెట్లో ప్రమోటర్లు, ఇన్వెస్టర్లకు చెందిన 9.52 కోట్ల ఈక్విటీ షేర్లను విక్రయించనుండటంతో రూ.5,500 కోట్ల నిధులను సేకరించాలని సంస్థ సంకల్పించింది. దీంతోపాటు ఎంక్యూర్ ఫార్మాస్యూటికల్స్ ఐపీవోకి కూడా అనుమతినిచ్చింది. ఈ రెండు సంస్థలు గతేడాది డిసెంబర్‌లోనే దరఖాస్తు చేసుకున్నాయి.

హైదరాబాద్‌లోకి సెంట్రీసిటీ

హైదరాబాద్, జూన్ 20: వెల్త్‌టెక్ స్టార్టప్ సెంట్రీసిటీ.. తాజాగా హైదరాబాద్‌లోకి అడుగుపెట్టింది. దక్షిణాది మార్కెట్‌పై ప్రత్యేక దృష్టి సారించడంలో భాగంగానే హైదరాబాద్‌లో కొత్త కార్యాలయాన్ని గురువారం ప్రారంభించింది. ఇప్పటికే సంస్థకు దేశవ్యాప్తంగా ఎనిమిది చోట్ల కార్యాలయాలు ఉన్నాయి. ఈ నూతన ఆఫీస్ కోసం ప్రతిభ కలిగిన ఉద్యోగులను తీసుకునే పనిలో పడింది సంస్థ.

ఎయిర్ ఇండియాతో జూమ్‌కార్ జట్టు

ముంబై, జూన్ 20: సెల్ఫ్ డ్రైవ్ కార్ షేరింగ్ ప్లాట్‌ఫాం సేవల సంస్థ జూమ్‌కార్..ఎయిర్ ఇండియా ఎక్స్‌ప్రెస్‌తో జట్టుకట్టింది. ఇరు సంస్థల మధ్య కుదిరిన ఒప్పందంతో హైదరాబాద్‌తోపాటు 19 విమానాశ్రయాల్లో నేరుగా సెల్ఫ్-డ్రైవ్ కారును బుకింగ్ చేసుకునే వీలుంటుంది. విమానాశ్రయాల్లో దిగిన తర్వాత క్యాబ్ కోసం వేచి చూడాల్సిన అవసరం లేదని, ఎయిర్‌లైన్స్‌కు చెందిన మొబైల్ యాప్ ద్వారానే తమకు నచ్చిన కారును బుకింగ్ చేసుకునే వీలుంటుంది.

స్విస్ బ్యాంకుల్లో తగ్గిన డిపాజిట్లు

2023లో 70 శాతం దిగి రూ.9,771 కోట్లకు..



న్యూఢిల్లీ, జూన్ 20: స్విస్ బ్యాంకుల్లో భారతీయులు, దేశీయ సంస్థల డిపాజిట్లు మరింత తగ్గాయి. వరుసగా రెండో ఏడాది 2023లోనూ స్విస్ బ్యాంకుల్లో డిపాజిట్లు 70 శాతం తగ్గి నాలుగేండ్ల కనిష్ఠ స్థాయి రూ.9,771 కోట్ల(1.04 బిలియన్ల స్విస్ ఫ్రాంక్స్)కు పరిమితమయ్యాయని స్విట్జర్లాండ్ సెంట్రల్ బ్యాంక్ విడుదల చేసిన వార్షిక నివేదికలో వెల్లడించింది. 2021లో 14 ఏండ్ల గరిష్ఠ స్థాయి 3.83 బిలియన్ల స్విస్ ఫ్రాంక్స్‌కి చేరుకున్న డిపాజిట్లు ఆ తర్వాత వరుసగా రెండేండ్ల పాటు తగ్గుముఖం పట్టడం విశేషం. బాండ్లు, సెక్యూరిటీ, ఇతర ఆర్థిక మార్గాల ద్వారా వచ్చిన పెట్టుబడుల ఆధారంగా సెంట్రల్ బ్యాంక్ ఈ నివేదికను రూపొందించింది. అయినప్పటికీ స్విట్జర్లాండ్‌లో భారతీయులు కలిగివున్న నల్లధనం ఎంత అనేది ఇప్పటికీ తెలియరాలేదు. ఇండియన్స్, ఎన్ఆర్ఐలు లేదా ఇతరులు స్విస్ బ్యాంకుల్లో ఇతర దేశాలకు చెందిన సంస్థల పేర్లతో పెట్టిన డిపాజిట్లను ఈ గణాంకాల్లో చేర్చలేదు. 2006లో రికార్డు స్థాయిలో 6.5 బిలియన్ల స్విస్ ఫ్రాంక్స్ డిపాజిట్లు ఉండగా, ఆ తర్వాతి తగ్గుముఖం పట్టాయని తన నివేదికలో వెల్లడించింది.

- 2020లో 39 శాతం పెరిగిన దేశీయ డిపాజిట్లు, 2021లో 8 శాతం అధికమవగా, 2022లో మాత్రం 18 శాతం తగ్గాయి.
- డిపాజిట్లలో బ్రిటన్ తొలిస్థానంలో నిలిచింది. 254 బిలియన్ల స్విస్ ఫ్రాంక్స్ డిపాజిట్లు కలిగివున్నది. ఆ తర్వాతి స్థానంలో అమెరికా(71 బిలియన్ల స్విస్ ఫ్రాంక్స్), ఫ్రాన్స్(64 బిలియన్ల స్విస్ ఫ్రాంక్స్) ఉన్నాయి.
- ఆ తర్వాతి స్థానాల్లో వెస్టిండీస్, జర్మనీ, హాంకాంగ్, సింగపూర్, లగ్జంబర్గ్ దేశాలున్నాయి.
- 2022లో 46వ స్థానంలో ఉన్న భారత్ ర్యాంక్.. ఈసారికిగాను 67వ స్థానానికి పడిపోయింది.
- మొత్తంగా 2022లో 1.15 ట్రిలియన్ స్విస్ ఫ్రాంక్స్‌గా ఉన్న డిపాజిట్లు 2023లో 983 బిలియన్ స్విస్ ఫ్రాంక్స్‌లకు తగ్గాయి.

తగ్గిన ఎఫ్‌డీఐలు.. పడిపోయిన ర్యాంక్

న్యూఢిల్లీ, జూన్ 20: విదేశీ పెట్టుబడులు ఆకట్టుకోవడంలో భారత్ నిరాశాపరుస్తున్నది. 2023లో దేశంలోకి వచ్చే విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు ఏడాది ప్రాతిపదికన 43 శాతం తగ్గి 28 బిలియన్ డాలర్లకు పరిమితమయ్యాయి. దీంతో వరల్డ్ ఇన్వెస్ట్‌మెంట్ ర్యాంకింగ్‌లో భారత ర్యాంక్ 15వ స్థానానికి పడిపోయిందని ఐక్యరాజ్యసమితి కాన్ఫరెన్స్ ఆఫ్ ట్రేడ్ అండ్ డెవలప్‌మెంట్(యూఎన్‌సీటీఏడీ) తాజాగా విడుదలచేసిన నివేదికలో వెల్లడించింది. 2022లో భారత్‌లోకి వచ్చిన 48 బిలియన్ డాలర్లతో 8వ స్థానంలో నిలిచిన విషయం తెలిసిందే.

నేడు తైవాన్‌కు పరిశ్రమల శాఖ అధికారులు

హైదరాబాద్, జూన్ 20 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో సాధ్యమైనన్ని ఎక్కువ ఎలక్ట్రానిక్ ఉత్పత్తుల పరిశ్రమలను నెలకొల్పడమే లక్ష్యంగా పరిశ్రమల శాఖకు చెందిన అధికారుల బృందం శుక్రవారం తైవాన్‌కు వెళ్లనున్నది. విదేశీ పెట్టుబడులు ఆకట్టుకోవడమే లక్ష్యంగా పరిశ్రమల శాఖకు చెందిన ఉన్నతాధికారులు అక్కడి ఎలక్ట్రానిక్స్ వస్తువులతోపాటు చిప్‌ల తయారీ రంగానికి చెందిన సంస్థల ప్రతినిధులతో ప్రత్యేకంగా భేటీకానున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఇస్తున్న రాయితీలపై ప్రధానంగా వివరించనున్నారు.

అన్‌సెక్యూర్డ్ లోన్లపై చర్యలుండాల్సిందే: ఆర్బీఐ

ముంబై, జూన్ 20: సంక్షోభాన్ని ముందే పసిగట్టి, దాన్ని అడ్డుకోవడానికి కృషి చేస్తున్నామని రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) గవర్నర్ శక్తికాంత దాస్ తెలిపారు. ఈ క్రమంలోనే అన్‌సెక్యూర్డ్ రుణాలపై ఆర్బీఐ చర్యలు తీసుకోకపోతే అవి పెద్ద సమస్యల్నే సృష్టిస్తాయని హెచ్చరించారు. గురువారం ఇక్కడి ఆర్బీఐ కాలేజ్ ఆఫ్ సూపర్‌వైజర్స్‌లో ఆర్థిక స్థితిస్థాపకతపై జరిగిన అంతర్జాతీయ సదస్సులో దాస్ మాట్లాడారు. గత ఏడాది నవంబర్‌లో తీసుకున్న చర్య.. అన్‌సెక్యూర్డ్ రుణాలతో రిస్క్‌ను అడ్డుకున్నదని గుర్తుచేశారు. ఆర్బీఐ తీసుకున్న చర్యలతోనే క్రెడిట్ కార్డు పోర్ట్‌ఫోలియోల్లో వృద్ధి 30 శాతం నుంచి 23 శాతానికి తగ్గిందన్నారు. అలాగే బ్యాంకింగ్, బ్యాంకింగేతర ఆర్థిక సంస్థ (ఎన్‌బీఎఫ్‌సీ)ల్లో రిస్క్‌తో కూడుకున్న రుణాలు 29 శాతం నుంచి 18 శాతానికి దిగొచ్చిందని చెప్పారు.

ఇండ్లకు గిరాకీ నై

హైదరాబాద్‌లో ఈ త్రైమాసికం 20 శాతం తగ్గొచ్చని అంచనా



న్యూఢిల్లీ, జూన్ 20: గత ఏడాది వరకు హైదరాబాద్ ఇండ్ల కోసం ఎగబాడినవారంతా ఇప్పుడు సైలెంటైపోయినట్టు కనిపిస్తున్నది. ప్రముఖ రియల్ ఎస్టేట్ డాటా అనలిటిక్ సంస్థ ప్రాప్‌ఈక్విటీ అంచనాను చూస్తే ఇలాగే అనిపిస్తున్నది మరి. 10 రోజుల ముందుగానే ఈ ఏప్రిల్-జూన్ త్రైమాసికానికి సంబంధించి దేశంలోని 9 ప్రధాన నగరాల్లో ఇండ్ల అమ్మకాలపై ప్రాప్‌ఈక్విటీ ఓ నివేదికను తెచ్చింది. గురువారం విడుదలైన ఈ రిపోర్టు ప్రకారం ఈ నెలాఖరుతో ముగిసే 3 నెలల కాలంలో గతంతో పోల్చితే హైదరాబాద్‌లో హౌజింగ్ సేల్స్ భారీగానే తగ్గిపోతాయన్న సంకేతాలు వస్తున్నాయి. నిరుడు ఏప్రిల్-జూన్‌లో నగరంలో నమోదైన ఇండ్ల అమ్మకాలు 18,757 యూనిట్లుగా ఉన్నాయి. అయితే ఈసారి 15,016 యూనిట్లకే పరిమితం కావచ్చని ప్రాప్‌ఈక్విటీ లెక్కలు చెప్తున్నాయి. విక్రయాలు 3,741 యూనిట్ల మేరకు తగ్గుతాయని అంటున్నది. ఇది 20 శాతానికి సమానం.

దేనికి సంకేతం?

ఇండ్ల అమ్మకాలపై ప్రాప్‌ఈక్విటీ పరిగణనలోకి తీసుకున్న నగరాల్లో ఒక్క హైదరాబాద్‌లోనే అత్యధికంగా డిమాండ్ పడిపోతున్నట్టు తేలడం గమనార్హం. నిజానికి ఎప్పుడూ హైదరాబాద్‌లో నివాసాలకు కొనుగోలుదారుల నుంచి పెద్ద ఎత్తునే ఆసక్తి కనిపించేది. కానీ ఈసారి అందుకు విరుద్ధంగా అంచనాలుండటం ఇప్పుడు మిక్కిలి ప్రాధాన్యతను సంతరించుకుంటున్నది. ఇక రాష్ట్రంలో కొత్త ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నేపథ్యంలో ఇది మరింత హాట్ టాపిక్‌గా మారుతున్నది. నిజానికి గత పదేండ్లలో నాటి బీఆర్ఎస్ ప్రభుత్వం రియల్ ఎస్టేట్ రంగ అభివృద్ధికి పెద్దపీట వేసింది. దీనికి తగ్గట్టుగానే మౌలిక వసతులను కల్పిస్తూ అనుబంధ రంగాలనూ ప్రోత్సహించారు అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్. అలాగే నాటి ఐటీ, పురపాలక శాఖల మంత్రి కేటీఆర్ తీసుకున్న చర్యలూ కలిసొచ్చాయి. బడా సంస్థల రాకతో ఇండ్లకు డిమాండ్ ఏర్పడింది. అయితే కొత్త ప్రభుత్వం ఏర్పాటై 6 నెలలైనా.. రియల్టీపై ఫోకస్ పెట్టకపోవడమే ఇండ్ల అమ్మకాలను దెబ్బతీస్తున్నదన్న అభిప్రాయాలు వినిపిస్తున్నాయి.

- *గత ఏడాది ఏప్రిల్-జూన్‌లో దేశంలోని 9 నగరాల్లో 1,21,856 యూనిట్ల ఇండ్ల అమ్మకాలు జరిగాయి. అయితే 2 శాతం తగ్గి ఈ ఏడాది ఏప్రిల్-జూన్‌లో 1,19,901 యూనిట్లకే పరిమితం కావచ్చంటున్న ప్రాప్‌ఈక్విటీ.*
- *ఈ జనవరి-మార్చి అమ్మకాలతో చూస్తే 18 శాతం పడిపోనున్నాయి. నాడు 1,46,194 ఇండ్ల విక్రయాలు జరిగాయి.*
- *హైదరాబాద్, పుణెల్లో హౌజింగ్ సేల్స్‌కు డిమాండ్ లేకపోవడమే ఇందుకు ప్రధాన కారణమని ప్రాప్‌ఈక్విటీ విశ్లేషించింది.*
- *మొత్తం 9 నగరాల్లో పుణె, హైదరాబాద్‌ల్లో మాత్రమే గతంతో పోల్చితే ఇండ్ల అమ్మకాలు క్షీణిస్తాయని ప్రాప్‌ఈక్విటీ చెప్తున్నది. అయితే బెంగళూరు, ముంబై, చెన్నైల్లో యథాతథం.*
- *నవీ ముంబై, కోల్‌కతాల్లో ఆకర్షణీయ వృద్ధి నమోదయ్యేందుకు వీలున్నది. థానె, ఢిల్లీ-ఎన్‌సీఆర్‌లలోనూ చెప్పుకోదగ్గరీతిలోనే నివాస విక్రయాలు పెరగవచ్చు.*

ఈ ఏప్రిల్-జూన్‌లో దేశంలోని ప్రధాన నగరాల్లో ఇండ్ల అమ్మకాల అంచనా

నగరం	2023	2024	వృద్ధి
థానె	22,956	25,041	9%
పుణె	26,586	22,482	-15%
బెంగళూరు	15,088	15,127	-
హైదరాబాద్	**18,757**	**15,016**	**-20%**
ముంబై	13,219	13,032	-
ఢిల్లీ-ఎన్‌సీఆర్	9,635	10,198	7%
నవీ ముంబై	6,640	9,035	36%
కోల్‌కతా	4,025	5,130	23%
చెన్నై	4,950	4,851	-